రాహుల్ గాంధీ జన్మదిన వేడుకలు

దశ, ఓయూ: కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ జన్మదినాన్ని పురస్కరించుకుని నగరంలోని పలు ప్రాంతాల్లో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఘనంగా వేడుకలు నిర్వహించారు. ఈ మేరకు తార్నాక చౌరస్తాలో టీపీసీసీ సెక్రటరీ జీడీ అమర్నాథ్ గౌడ్ ఆధ్వర్యంలో రాహుల్ గాంధీ పుట్టిన రోజు వేడుకలను ఘనంగా నిర్వహించారు. సికింద్రాబాద్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి, కంటెస్టెడ్ ఎమ్మెల్యే ఆదం సంతోష్ కుమార్ ముఖ్యఅతిథిగా హాజరై కేక్ కట్ చేసి, పేదలకు పండ్లు, పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆదం సంతోష్ మాట్లాడుతూ దేశంలో ప్రజాస్వామ్య విలువల పరిరక్షణ, సామాజిక న్యాయం, యువతకు ఉపాధి అవకాశాలు, రైతుల సంక్షేమం కోసం రాహుల్ గాంధీ నిరంతరం పోరాటం చేస్తున్నారని పేర్కొన్నారు.దేశ ఐక్యత, లౌకికవాదం, రాజ్యాంగ పరిరక్షణ కోసం ఆయన చేస్తున్న కృషి యువతకు స్ఫూర్తిదాయకమని అన్నారు. ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకునేందుకు దేశవ్యాప్తంగా పాదయాత్రలు, ప్రజా ఉద్యమాలు చేపట్టి ప్రజలతో మమేకమైన నాయకుడిగా రాహుల్ గాంధీ గుర్తింపు పొందారని తెలిపారు. భారతదేశ భవిష్యత్తు కోసం ఆయన అందిస్తున్న నాయకత్వం కాంగ్రెస్ పార్టీకి కొత్త ఉత్సాహాన్ని తీసుకువచ్చిందని పేర్కొన్నారు. రాహుల్ గాంధీ సంపూర్ణ ఆరోగ్యంతో, దీర్ఘాయుష్షుతో ప్రజాసేవలో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో శిల్పా చారి, శశాంక్, మహేష్, ప్రమోద్, నరేష్, వెంకటేష్, రాజు, దేవిడ్, శ్రవణ్, భాస్కర్, సైదులు తో పాటు స్థానిక కాంగ్రెస్ నాయకులు, ప్రజాప్రతినిధులు, మహిళా నాయకులు, యువజన కాంగ్రెస్ కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

రైతులు సాంకేతికతను వినియోగించుకోవాలి: జిల్లా వ్యవసాయ అధికారి శైలజ

దశ, అబ్దుల్లాపూర్‌మెట్ : తుర్కయంజాల్ రైతు సేవ సహకార సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం రైతులకు ఎరువుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా వ్యవసాయ అధికారి శైలజ రైతులకు ఎరువుల బుకింగ్ యాప్ వినియోగంపై అవగాహన కల్పించారు.

ఫర్టిలైజర్ బుకింగ్ యాప్ ద్వారా రైతులు ఇంటి వద్ద నుంచే యూరియాను బుక్ చేసుకోవచ్చని, ఎరువుల దుకాణాల వద్ద క్యూలలో నిలబడాల్సిన అవసరం ఉండదని ఆమె తెలిపారు. తెలంగాణలో విజయవంతంగా అమలవుతున్న ఈ విధానాన్ని ఆదర్శంగా తీసుకుని కేంద్ర ప్రభుత్వం కూడా "ఫార్మర్స్ ఫర్ ఫర్టిలైజర్ సేల్ " మొబైల్ యాప్‌ను రూపొందించిందని చెప్పారు. రైతులు ఈ యాప్‌ను వినియోగించుకుని సులభంగా ఎరువులు పొందాలని సూచించారు.

అనంతరం రైతు రిజిస్ట్రీ ప్రాధాన్యతపై మాట్లాడుతూ, ప్రతి రైతు భూమి వివరాలు, వ్యవసాయ సమాచారాన్ని సమగ్రంగా నమోదు చేసేందుకు తెలంగాణ ప్రభుత్వం రైతు రిజిస్ట్రీని అమలు చేస్తోందని తెలిపారు. రైతులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు, సబ్సిడీలు, పంటల బీమా, ఎరువులు, విత్తనాలు తదితర సేవలను పారదర్శకంగా అందించడంలో ఇది కీలకంగా మారుతుందని పేర్కొన్నారు. రైతు రిజిస్ట్రీ ద్వారా ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు నేరుగా రైతులకు చేరుతాయని, పంటల నమోదు, పంటల బీమా ప్రక్రియ సులభతరం అవుతుందని తెలిపారు.

అలాగే ఎరువుల బుకింగ్ యాప్‌లో భూ వివరాలు కనిపించాలంటే రైతు రిజిస్ట్రీ నమోదు తప్పనిసరి అని చెప్పారు. విత్తనాలు, ఎరువులు, ఇతర సబ్సిడీల పంపిణీలో పారదర్శకత పెరగడంతో పాటు రైతుల వివరాలు ఒకే డిజిటల్ వేదికపై

అందుబాటులో ఉంటాయని వివరించారు. కావున రైతులు ఆధార్ కార్డు, ఆధార్‌కు అనుసంధానమైన మొబైల్ నంబర్, పట్టాదారు పాస్‌బుక్‌తో గ్రామ వ్యవసాయ విస్తరణాధికారులు లేదా సమీప మీ సేవా కేంద్రాలను సంప్రదించి రైతు రిజిస్ట్రీ నమోదు ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి పల్లవి సూచించారు.

నేడు (పీఎం-కిసాన్) 23వ విడత నిధుల విడుదల

ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధి (పీఎంకిసాన్) 23వ విడత నిధుల విడుదల కార్యక్రమం జూన్ 20న మధ్యాహ్నం 3.30 గంటలకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చేతుల మీదుగా జరగనుంది. ఈ కార్యక్రమాన్ని అబ్దుల్లాపూర్ రైతు వేదికలో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా నిర్వహించనున్నట్లు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమానికి మార్కెట్ కమిటీ డైరెక్టర్లు, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల ప్రతినిధులు, ప్రజాప్రతినిధులు, రైతులు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని అధికారులు కోరారు.

మనికేశ్వరి నగర్లో ఘనంగా రాహుల్ గాంధీ పుట్టినరోజు

దశ ఓయూ :తార్నాక డివిజన్ మనికేశ్వరి నగర్ కమాన్ వద్ద కాంగ్రెస్ పార్టీ జాతీయ నాయకుడు పార్లమెంట్ సభ్యుడు రాహుల్ గాంధీ పుట్టినరోజు వేడుకలను తార్నాక డివిజన్ కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ వేముల శ్రీనివాస్ ఆధ్వర్యంలో పుట్టినరోజు వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమనికి ముఖ్యఅతిథిగా కాంగ్రెస్ పార్టీ సికింద్రాబాద్ నియోజకవర్గం ఇంచార్జ్ ఆదం సంతోష్ కుమార్,డి సీసీ ప్రెసిడెంట్ సినీంద్రాబాద్ దేపక జూన్ హాజరై కేక్ కట్ చేసి రాహుల్ గాంధీకి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆదం సంతోష్ కుమార్ మాట్లాడుతూ రాహుల్ గాంధీ రానున్న రోజుల్లో ప్రధానమంత్రి అవడం ఖాయం అన్నారు. రాహుల్ గాంధీని ప్రధాని చేయడానికి ప్రతి ఒక్క కాంగ్రెస్ కార్యకర్త, నాయకుడు కృషి చేయాలని పిలుపునిచ్చారు. భారతదేశం అభివృద్ధి చెందాలంటే అది కేవలం రాహుల్ గాంధీ వల్లనే సాధ్యమవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నేతలు లింగయ్య, కే నర్సింహ,అలకుంట గణేష్,జీ. వెంకటేష్, వి రవి,బి వెంకటేష్, జలంధర్ రెడ్డి, జగదీశ్వర్, అశోక్,నరేష్,కుమార్,రాజేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

హైదరాబాద్‌లో ఘనంగా పాన్ ఇండియా జ్యువెల్స్ షో

దశ, హైదరాబాద్ : భారతదేశంలోని అతిపెద్ద ప్రీమియం ఆభరణాల ప్రదర్శనల్లో ఒకటైన పాన్ ఇండియా జ్యువెల్స్ షో హైదరాబాద్ నార్సింగిలోని ఓఎం కన్వెన్షన్‌లో జూన్ 19 నుంచి 21 వరకు మూడు రోజుల పాటు అత్యంత వైభవంగా నిర్వహించబడుతుంది. ఈ కార్యక్రమానికి మల్లారెడ్డి విశ్వవిద్యాలయం వైస్ చైర్‌పర్సన్ డాక్టర్ ప్రీతి రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు.సజ్జా అన్నపూర్ణ మరియు నిరంజన్ నిర్వహిస్తున ఈ పాన్ ఇండియా జ్యువెల్స్ షోలో దేశవ్యాప్తంగా ఉన్న 60కి పైగా ప్రముఖ జ్యువెలరీ బ్రాండ్లు పాల్గొని తమ ప్రత్యేక కలెక్షన్లను ప్రదర్శిస్తున్నారు. రెండు లక్షలకు పైగా అద్భుతమైన ఆభరణాల డిజైన్లు సందర్శకులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. సంప్రదాయ కళాత్మకత, అత్యున్నత నైపుణ్యం మరియు ఆధునిక డిజైన్‌ల సమ్మేళనంగా ఈ ప్రదర్శన నిలుస్తుందని ప్రీతీ రెడ్డి తెలిపారు. ఈ ప్రదర్శనలో బంగారం, వజ్రాలు, పోల్కీ, కుందన్, వెండి ఆభరణాలు అలాగే ప్రస్తుతం ట్రెండ్‌గా మారుతున్న ల్యాబ్‌గ్రోన్ డైమండ్ జ్యువెలరీ ప్రత్యేక ఆకర్షణగా ఉన్నాయి. రోజువారీ వినియోగానికి అనువైన డిజైన్ల నుంచి విలాసవంతమైన పెళ్లి వేడుకల ఆభరణాల వరకు విస్తృత శ్రేణి కలెక్షన్లు ఒకే వేదికపై అందుబాటులో ఉండటం విశేషం. ఈ సందర్భంగా వ్యవస్థాపకులు సజ్జా అన్నపూర్ణ మాట్లాడుతూ, ప్రదర్శన విజయవంతం కావడానికి సహకరించిన బ్రాండ్లు, ఎగ్జిబిటర్లు, భాగస్వాములు, సందర్శకులందరికీ కృతజ్ఞతలు తెలిపారు. హైదరాబాద్‌లో ప్రీమియం ఆభరణాలపై పెరుగుతున్న డిమాండ్ మరియు జ్యువెలరీ పరిశ్రమకు ఈ నగరం కీలక మార్కెట్‌గా మారుతున్న విషయాన్ని ఈ షో స్పష్టంగా తెలియజేస్తోందన్నారు.

రాహుల్ గాంధీ జన్మదినం సందర్భంగా విద్యార్థులకు విద్యా సామగ్రి పంపిణీ

దశ ఓయూ: కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ జన్మదినాన్ని పురస్కరించుకుని ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు పుస్తకాలు, పెన్సిళ్లు, రబ్బర్లు, బిస్కెట్లు పంపిణీ చేయడంతో పాటు కేక్ కట్ చేసి వేడుకలను ఘనంగా నిర్వహించారు. పిల్లల్లో ఆనందాన్ని నింపడంతో పాటు విద్యాభివృద్ధికి ప్రోత్సాహం అందించాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు నాయకులు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మమేకమైన నాయకులు వారికి శుభాకాంక్షలు తెలియజేసి, విద్యలో రాణించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ప్రాంతీయ రవాణా సంస్థ సభ్యుడు సురేష్ లాల్ నేతికర్, కాంగ్రెస్ పార్టీ నాయకుడు కిట్టు తార్నాకతో పాటు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. సేవా కార్యక్రమాల ద్వారా రాహుల్ గాంధీ జన్మదినాన్ని నిర్వహించడం అభినందనీయమని వారు పేర్కొన్నారు.

"శపథ్" లక్ష్యం "డ్రగ్ ఫ్రీ - యంగ్ ఇండియా"

■ *అగర్వాల్ సమాజ్ తెలంగాణ*

దశ, హైదరాబాద్: యువతను మాదకద్రవ్యాల బారిన పడకుండా కాపాడే లక్ష్యంతో "శపథ్" - అవర్ మిషన్, అవర్ రెస్పాన్సిబిలిటీ" పేరిట "డ్రగ్ ఫ్రీ - యంగ్ ఇండియా" సామాజిక ఉద్యమాన్ని అగర్వాల్ సమాజ్, తెలంగాణ ఆధ్వర్యంలో ఈ నెల 21 న ప్రారంభిస్తున్నామని "శపథ్" నిర్వహణ కమిటీ అధ్యక్షులు రామ్ నివాస్ బన్సల్, ప్రాజెక్ట్ డైరెక్టర్ దేవేంద్ర శాస్త్రి లు తెలిపారు. హైదరాబాద్, బషీర్ బాగ్, దేశోద్ధారక భవన్ లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో వారు "శపథ్"

గోడ పత్రికను ఆవిష్కరించి మాట్లాడుతూ రోజురోజుకు యువతలో పెరుగుతున్న మాదకద్రవ్యాల వినియోగాన్ని అరికట్టేందుకు సమిష్టి కృషి అవసరమని భావించి ఈ నెల 21 న హైదరాబాద్, నౌబత్ పహాడ్, భాస్కర ఆడిటోరియంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం, తెలంగాణ పోలీస్ శాఖ, ఈగల్ ఫోర్స్ సహకారంతో పెద్దఎత్తున "డ్రగ్ ఫ్రీ - యంగ్ ఇండియా" "శపథ్" సామాజిక ఉద్యమాన్ని ప్రారంభిస్తున్నామని తెలిపారు. ఈ ఉద్యమాన్ని రాష్ట్ర రవాణా మరియు బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రారంభిస్తారని, రాష్ట్ర బిసి సంక్షేమం సలహాదారు వి. హనుమంత్ రావు ఆత్మీయ అతిథిగా, అగర్వాల్ సమాజ్ ముఖ్య సలహాదారు, మాజీ ఎంపీ గిరీష్ కుమార్ సంఘీ, ఎమ్మెల్యే టి. శ్రీనివాస్ యాదవ్, రాష్ట్ర డిజిపి సి.వి. ఆనంద్, హైదరాబాద్ జిల్లా కలెక్టర్ ప్రియాంక అలా గౌరవ అతిథిలుగా పాల్గొంటారని, వీరితోపాటు తెలంగాణ అంటి నార్కోటిక్స్ బ్యూరో డైరెక్టర్ సందీప్ శాండిల్య కీలకోపన్యాసం చేస్తారని వారు వెల్లడించారు. యువత, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, సామాజిక సంస్థలు, వైద్య నిపుణులు, చట్ట అమలు సంస్థలను ఒకే వేదికపైకి తీసుకువచ్చి మాదకద్రవ్యాల వ్యతిరేక ఉద్యమాన్ని బలోపేతం చేయడమే "శపథ్" ప్రధాన లక్ష్యమని తెలిపారు. ఇందుకోసం విద్యాసంస్థలు, రాష్ట్రంలోని పట్టణాల కూడళ్లలో విధి నాటకాలు, ర్యాలీలు నిర్వహించి యువత డ్రగ్స్ బారిన పడకుండా కాపాడుతామన్నారు. "శపథ్" కేవలం ఒక ప్రచారం మాత్రమే కాదు, ప్రజల భాగస్వామ్యంతో ముందుకు సాగే సామాజిక ఉద్యమం. యువతను వ్యసనాల నుంచి దూరం చేసి కుటుంబ విలువలు, సామాజిక బాధ్యతల వైపు మళ్లించడమే మా సంకల్పం వారు వెల్లడించారు.

జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్

దశ, సూర్యాపేట ప్రతినిధి : జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలను జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు టెక్స్ట్ బుక్స్, కంప్యూటర్ ల్యాబ్‌ను సందర్శించి, విద్యార్థులకు అందుతున్న డిజిటల్ విద్యపై ఉపాధ్యాయులను వివరాలు అడిగారు. మధ్యాహ్న భోజన పథకం అమలు తీరును తెలుసుకోవడానికి కిచెన్ షెడ్‌ను, పాఠశాలలోని టాయిలెట్లను తనిఖీ చేశారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని, పాఠశాల ఆవరణను పరిశుభ్రంగా ఉంచాలని సిబ్బందిని ఆదేశించారు. అనంతరం పదవ తరగతి గదిలోకి వెళ్ళిన కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అక్కడ కాసేపు ఉపాధ్యాయుడిగా మారి విద్యార్థిని, విద్యార్థులతో ముచ్చటించారు. వారి చదువుల తీరును, భవిష్యత్తు లక్ష్యాలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల భాషా నైపుణ్యాలను పరీక్షించడానికి స్వయంగా వారి చేత తెలుగు టెక్స్ట్ బుక్ చదివించారు. స్పష్టమైన ఉచ్చారణతో చదివిన విద్యార్థులను ఆయన అభినందించారు. పదవ తరగతి విద్యార్థులు కష్టపడి చదివి మంచి ఫలితాలు సాధించాలని, పాఠశాలకు, జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని కలెక్టర్ ఈ సందర్భంగా ఆకాంక్షించారు.

12వ అంతర్జాతీయ యోగ దినోత్సవాన్ని విజయవంతం చేయండి

■ *యోగాతోనే సంపూర్ణ ఆరోగ్యం.*

■ *ఎల్లక్కిసిటీ డిపార్ట్మెంట్ నల్గొండ డి ఈ. డి ప్రభాకర్*

దశ సూర్యాపేట ప్రతినిధి : యోగాతోని సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని నల్గొండ ఎలక్ట్రిసిటీ డి. ఈ. డి ప్రభాకర్ తెలిపారు. శుక్రవారం ఈనెల 21న అంతర్జాతీయ యోగా దినోత్సవం పురస్కరించుకొని సూర్యాపేట ఉన్నత యోగా శిక్షణా కేంద్రం ఆధ్వర్యంలో యోగ పై అవగాహన ర్యాలీని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన ర్యాలీ ప్రారంభించి మాట్లాడారు. ప్రతి ఒక్కరికి నిజజీవితంలో యోగ ఎంతోఅవసరంఅనితెలిపారు.మనిషిఆరోగ్యంగా ఉంటే ఏదైనా సాధించవచ్చు అన్నారు. ఎంజీ రోడ్డు లోని మహాత్మా గాంధీ విగ్రహం వద్ద నుండి ప్రారంభమైన ర్యాలీ కొత్త బస్టాండ్, వాణిజ్య భవన్ సెంటర్, శంకర్ విలాస్ సెంటర్, ఈద్గా రోడ్డు మీదిగా ర్యాలీ నిర్వహించారు. సూర్యాపేట ఉన్నత యోగా శిక్షణ కేంద్రం శిక్షకులు చాడ పాపిరెడ్డి ఆధ్వర్యంలో 100 మంది తో ర్యాలీ నిర్వహించారు. యోగా గురువు చాడపాపిరెడ్డి మాట్లాడుతూ వేల సంవత్సరాల క్రితం భారతదేశంలో ఉద్భవించిన యోగ శారీరక మానసిక, ఆధ్యాత్మిక సాధనల కలయిక అన్నారు. ఈ యోగా 19 శతాబ్దపు చివర నుండి ప్రపంచవ్యాప్తంగా విస్తరించిందన్నారు. ప్రధాని నరేంద్ర మోడీ యోగ ప్రాముఖ్యతను గుర్తించి ఐక్యరాజ్యసమితిలో 2014 సెప్టెంబర్ 27న సర్వసభ్య సమావేశంలో ప్రతిపాదించడం జరిగినది అన్నారు. ఆనాటి నుండి యోగాను ప్రపంచవ్యాప్తంగా తీసుకెళ్లడానికి మార్గం సుగమైన శుభమైనది అన్నారు. జూన్ 21 2015 నుండి గత 11 సంవత్సరాలుగా ప్రపంచవ్యాప్తంగా అంతర్జాతీయ దినోత్సవం జరుపుకుంటున్నాముఅని, ప్రస్తుతం 12వ అంతర్జాతీయ దినోత్సవాన్ని ఈనెల 21 ఆదివారం ఉదయం 6 గంటలకు బ్రాహ్మణ కళ్యాణ మండపంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంత్ నిరంకార సంస్థ జిల్లా అధ్యక్షురాలు కడారి సరళ, యోగ సాధకులు వీ లింగయ్య,మల్లారెడ్డి,గోరెంట్ల శ్రీనివాస్,సుధాకర్, వెంకన్న, శ్రీధర్, మురళీకృష్ణ, లక్ష్మీనారాయణ వెంకన్న, శ్రీధర్, సుదర్శన్ రెడ్డి మంజుల తదితరులు పాల్గొన్నారు.

సేవ్ మణుగూరు పోరాటాన్ని జయప్రదం చేయండి: ఏఐటీయూసీ

దశ,మణుగూరు: మణుగూరు ఏరియాలోని పీకేఓసీ డీప్ సైడ్ ఎక్స్‌టెన్షన్ బ్లాక్‌ను సింగరేణికే కేటాయించాలని, మణుగూరు ఓసీపీ మూసివేయక ముందే ఎక్స్‌టెన్షన్ అనుమతులు మంజూరు చేయాలని కోరుతూ సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా కేసీహెచ్‌పీ డీజీఎం రుక్మాన్ సింగ్ గౌడేకు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి వై. రామ్ గోపాల్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన ఎంఎండీఆర్ చట్టం ద్వారా దేశంలోని బొగ్గు బ్లాకులను ప్రైవేటు సంస్థలకు అప్పగించే పరిస్థితి ఏర్పడిందని విమర్శించారు. గతంలో టీఆర్ఎస్ ప్రభుత్వం ఈ చట్టానికి మద్దతు ఇవ్వడం వల్లే పార్లమెంట్‌లో అది ఆమోదం పొందిందని పేర్కొన్నారు. ఆ చట్టం ఫలితంగానే సత్తుపల్లి ఓసీ,

కోయగూడెం ఓసీ3 బొగ్గు బ్లాకులు ప్రైవేటు సంస్థలకు దక్కాయని, ప్రస్తుతం మణుగూరులోని పీకేఓసీ డీప్ సైడ్ బ్లాక్ కూడా వేలానికి రావడం ఆందోళన కలిగించే విషయమన్నారు. 1974లో మణుగూరు ఏరియాలో సింగరేణి కార్యకలాపాలు ప్రారంభమైనప్పటి నుంచి ఈ ప్రాంతం అభివృద్ధి చెందిందని, బొగ్గు పరిశ్రమ ఆధారంగానే మణుగూరు పట్టణంతో పాటు హెవీ వాటర్ ప్లాంట్, భద్రాచలం పేపర్ బోర్డు, భద్రాద్రి థర్మల్ పవర్ స్టేషన్ వంటి సంస్థల్లో వేలాది మందికి ఉపాధి అవకాశాలు లభించాయని తెలిపారు. పీకేఓసీ డీప్ సైడ్ బ్లాక్‌ను ప్రైవేటు సంస్థలకు కేటాయిస్తే మణుగూరు ఏరియాలో పనిచేస్తున్న సుమారు 2,400 మంది సింగరేణి కార్మికులు, 3,000 మంది కాంట్రాక్ట్ కార్మికుల ఉపాధికి ముప్పు వాటిల్లే అవకాశం ఉందన్నారు. మణుగూరు 170 యాక్ట్ పరిధిలో ఉన్నందున బొగ్గు తవ్వకాలు ప్రభుత్వ రంగ సంస్థల ద్వారానే నిర్వహించాలని ఏఐటీయూసీ డిమాండ్ చేస్తోందన్నారు.సింగరేణిఅభివృద్ధి,కార్మికసంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని "సేవ్ మణుగూరు" నినాదంతో ఉద్యమాన్ని చేపట్టామని, పీకేఓసీ డీప్ సైడ్ బ్లాక్‌ను సింగరేణికే కేటాయించడంతో పాటు మణుగూరు ఓసీపీకి వెంటనే ఎక్స్‌టెన్షన్ అనుమతులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు.

ప్రజాసేవే రాహుల్ గాంధీ రాజకీయాల లక్ష్యం

దశ సూర్యాపేట ప్రతినిధి : ప్రజాసేవే రాహుల్ గాంధీ రాజకీయాల లక్ష్యమని ఎమ్మెల్సీ శంకర్ నాయక్, ఏఐసిసి సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి అన్నారు. సూర్యాపేట జిల్లా కేంద్రంలో సూర్యాపేట యూత్ కాంగ్రెస్ అసెంబ్లీ అధ్యక్షుడు కర్రిముల్లా బేగ్ జావేద్ ఆధ్వర్యంలో కేకు కటింగు కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి మున్సిపల్ చైర్ పర్సన్ మొరిశెట్టి నివేదిత లక్షాధి తో పాటు వారు ముఖ్య అతిథిలుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాహుల్ గాంధీ దేశ ప్రజల హక్కుల పరిరక్షణ, సామాజిక న్యాయం, యువత, రైతులు, మహిళల సంక్షేమం కోసం నిరంతరం పోరాడుతున్న నాయకుడని కొనియాడారు. ప్రజాసేవ, ప్రజాస్వామ్య పరిరక్షణ, రాజ్యాంగ విలువల కాపాడటంలో ఆయన చేస్తున్న కృషి యువతకు ఆదర్శంగా నిలుస్తోందన్నారు. దేశ ప్రజల సమస్యలపై నిరంతరం గళం విప్పుతూ ప్రజల పక్షాన నిలబడుతున్న రాహుల్ గాంధీకి మంచి ఆరోగ్యం, దీర్ఘాయుష్షు కలగాలని ఆకాంక్షించారు.

అనంతరం ప్రభుత్వ జనరల్ హాస్పటల్లో పేదలకు పండ్లు, బ్రెడ్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ షఫీ ఉల్లా, డిసిసి అధ్యక్షుడు గుడిపాటి నరసయ్య, జిల్లా యువజన అధ్యక్షుడు ఎలిమినేటి అభినయ్, కౌన్సిలర్లు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

జ్వాల దశ
నిజం.. నిర్భయంగా..
శనివారం
20-06-2026

ఖమ్మం-భద్రాద్రి కొత్తగూడెం జిల్లా

ఖమ్మం వైరా | సత్తుపల్లి | పాడేరు | మధిర

భద్రాద్రి కొత్తగూడెం కొత్తగూడెం | ఇల్లందు | పినపాక | భద్రాచలం | అశ్వరావుపేట

WWW.DASHANEWS.COM

నీటిపారుదల ప్రాజెక్టుల భూసేకరణ వేగవంతం చేయాలి

❖ అధికారులతో ఆర్&ఆర్, ఇరిగేషన్ భూసేకరణ కమిషనర్ సమీక్ష

దశ, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బ్యూరో : జిల్లాలో కొనసాగుతున్న నీటిపారుదల ప్రాజెక్టులకు సంబంధించిన భూసేకరణ ప్రక్రియను వేగవంతం చేసి, పెండింగ్ అంశాలను త్వరితగతిన పరిష్కరించాలని ఆర్&ఆర్, ఇరిగేషన్ భూసేకరణ కమిషనర్ కె. శివకుమార్ నాయుడు అధికారులను ఆదేశించారు. శుక్రవారం అశ్వాపురం మండలంలోని సీతమ్మసాగర్ ప్రాజెక్టు, సీతారామ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు మొదటి పంప్ హౌస్‌ను పరిశీలించిన అనంతరం బీజీ కొత్తూరులో నిర్వహించిన సమీక్ష సమావేశంలో జిల్లా కలెక్టర్ అంకిత్‌తో కలిసి భూసేకరణ పురోగతిని ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా సీతారామ లిఫ్ట్ ఇరిగేషన్, సీతమ్మసాగర్ బహుళార్థక, పులుసుబొంత, సింగభూపాలెం తదితర సాగునీటి ప్రాజెక్టులకు సంబంధించిన భూసేకరణ, పరిహారం చెల్లింపులు, అటవీ అనుమతులు, సర్వే పనులు, కోర్టు కేసుల స్థితిగతులను అధికారులు కమిషనర్‌కు వివరించారు. ప్రాజెక్టుల అమలులో ఎదురవుతున్న సమస్యలను వెంటనే పరిష్కరించి, భూసేకరణను నిర్ణీత గడువులో పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు. రైతులకు న్యాయమైన పరిహారం అందేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని, అవార్డుల జారీ, పరిహారం చెల్లింపుల్లో జాప్యం లేకుండా చూడాలని కమిషనర్ ఆదేశించారు. రెవెన్యూ, నీటిపారుదల శాఖలు సమన్వయంతో పనిచేసి పెండింగ్ అంశాలను పరిష్కరించాలని సూచించారు.

సమీక్షలో జిల్లా కలెక్టర్ అంకిత్ మాట్లాడుతూ, సీతారామ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు ఫేజ్ 1 కింద 1,522 ఎకరాలకు అవార్డులు జారీ చేసినట్లు తెలిపారు. ఫేజ్ 2లో 2,365 ఎకరాలకు పరిహారం చెల్లించగా, ఫేజ్ 3లో 1,621 ఎకరాల్లో 1,350 ఎకరాలకు అవార్డులు జారీ చేసి, 903 ఎకరాలను స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు. మిగిలిన భూములకు నిధులు అందిన వెంటనే పరిహారం చెల్లింపులు పూర్తి చేస్తామని తెలిపారు .సమావేశంలో భద్రాచలం సబ్ కలెక్టర్ మృణాల్ శ్రేష్ఠ, అదనపు కలెక్టర్ వేణుగోపాల్, సూపరింటెండింగ్ ఇంజనీర్ శ్రీనివాస్ రెడ్డి, ల్యాండ్ సర్వే అసిస్టెంట్ డైరెక్టర్ శ్రీనివాసరావు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

వలస ఆదివాసి గ్రామంలో కమ్యూనిటీ కాంటాక్ట్ కార్యక్రమం

❖ 50 సోలార్ లైట్లు, విద్యార్థులకు విద్యా సామగ్రి పంపిణీ

దశ, కరకగూడెం: మండలంలోని అంగారి గూడెం వలస ఆదివాసి గ్రామంలో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో కమ్యూనిటీ కాంటాక్ట్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీఐ వెంకటేశ్వర్లు, ఎస్సై పి.వి.ఎన్. రావు పాల్గొని గ్రామస్తులతో మమేకమయ్యారు. ఈ సందర్భంగా గ్రామంలోని కుటుంబాలకు 50 సోలార్ లైట్లు పంపిణీ చేయడంతో పాటు విద్యార్థులకు పలకలు, పెన్సిల్స్ అందజేశారు. గ్రామ ప్రజల సమస్యలను తెలుసుకుని వారికి అవసరమైన సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. అలాగే గ్రామంలో లేదా పరిసర ప్రాంతాల్లో అనుమానాస్పద వ్యక్తులు సంచరిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సీఐ వెంకటేశ్వర్లు సూచించారు. ప్రజలు పోలీసులతో సత్సంబంధాలు కొనసాగిస్తూ శాంతిభద్రతల పరిరక్షణలో భాగస్వాములు కావాలని కోరారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, యువకులు, విద్యార్థులు, మహిళలు పాల్గొన్నారు. పోలీసుల సేవా కార్యక్రమాన్ని గ్రామస్తులు అభినందించారు.

ప్రాణం వాయువుని అందించాలి..

❖ సారపాక పంచాయతీలో లక్ష మొక్కలు నాటాలి..

❖ బాధ్యతగా మొక్కల నాటాలి

❖ భవిష్యత్ తరాలకు సంపూర్ణ ఆరోగ్యం అందాలి

❖ పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత: ఐటీడీఏ పీవో రాహుల్

దశ బూర్గంపాడు: సారపాక గ్రామపంచాయతీలో లక్ష్యం మొక్కలు నాటి ప్రాణవాయువును పెంచాలని బాధ్యతగా మొక్కల నాటి సంరక్షించే బాధ్యతను చేపట్టాలని పర్యావరణ పరిరక్షణ బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ఐటీడీఏ పీవో రాహుల్ అన్నారు. శుక్రవారం ఐటిఐ పిఓ చాంబర్లో సారపాక పంచాయతీకి సంబంధించి ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. పర్యావరణ పరిరక్షణ మొక్కల ప్రాముఖ్యతపై ఆయన మాట్లాడుతూ ప్రతి మనిషి దైనందన జీవితంలో భాగంగా ఎటువంటి రుగ్మతలు దరిచేరనీయకుండా ఉండాలంటే పర్యావరణం పచ్చదనం పరిశుభ్రంగా ఉండాలంటే తప్పనిసరిగా పర్యావరణాన్ని కాపాడుకొనుటకు విరివిగా ప్రజలకు ఉపయోగపడే వివిధ రకాల మొక్కలు నాటి వాటి సంరక్షణ బాధ్యత తీసుకుంటే వాతావరణం ఆహ్లాదకరంగా ఉండి ఎటువంటి అనారోగ్యాలు దరి చేరవని అన్నారు. ఫారెస్ట్, ఐ టి సి, ఎం ఎస్ ఆర్ ఏ జి ఎస్ గ్రామ పంచాయతీ అధికారులతో కలిసి సారపాక గ్రామపంచాయతీలో లక్షల మొక్కలు నాటి వాటి సంరక్షణ బాధ్యత తీసుకునే విధంగా ప్రణాళికలు తయారు చేయాలన్నారు.

పారిశ్రామిక ప్రాంతమైన సారపాకలో పర్యావరణం కలుషితం కాకుండా సారపాక గ్రామపంచాయతీ సర్పంచ్ ఆధ్వర్యంలో వనమహోత్సవంలో భాగంగా సంవత్సరానికి 25 వేల మొక్కలు చొప్పున నాలుగు సంవత్సరాలకు లక్ష మొక్కలు సారపాక లోని ప్రజలు ఎక్కువగా సంచరించేఖాళీ ప్రదేశాలలోగోదావరిపరివాహక ప్రాంతాలలో ముఖ్యమైన కూడళ్లలో ప్రజలకు ఉపయోగపడే, కార్బన్డయాక్సైడ్ ను పీల్చుకొని ఆక్సిజన్ అందించే మొక్కలను నాటి వాటి సంరక్షణ బాధ్యత తీసుకునే విధంగా సంబంధిత అధికారులు ప్రణాళికలు రూపొందించుకోవాలని అన్నారు. ముఖ్యంగా గానుగ, వేప, చింత, జామ, నేరేడు చెట్లతోపాటు వివిధ రకాల పండ్లకు సంబంధించిన మొక్కలను నాటాలని అన్నారు. లక్ష మొక్కలు నాటి వాటి సంరక్షణ బాధ్యతను పగడ్బందీగా తీసుకోవడానికి ఫారెస్ట్,ఐటిసి, ఎంఆర్ఇజిఎస్ అధికారులు గ్రామపంచాయతీ వారికి వివిధ రకాలు మొక్కలు అందించి వాటిని క్రమమైన పద్ధతిలో నాటించి ఈ కార్యక్రమం దిగ్విజయంగా విజయవంతం అవ్వడానికి సహకరించాలని ఆయన అన్నారు. అలాగే ఈ వన మహోత్సవం కార్యక్రమంలో ప్రజలను కూడా భాగస్వామ్యం చేసి గ్రామాలలో ప్రభుత్వ కార్యాలయాలలో మనకు ప్రాణవాయువును ప్రసాదించే చెట్లను నాటి వాటిని సక్రమంగా పెంచి వాతావరణం కలుషితం కాకుండా చూడాలని అన్నారు.

చెట్లను పెంచడం వలన పరిసరాలు శుభ్రంగా ఉండి మనకు ఎటువంటి అనారోగ్యాలు దరిచేరవని అందుకుప్రతి ఒక్కరు పర్యావరణాన్ని పరిరక్షించుకుంటూ ప్రాణవాయువు ఇచ్చే మొక్కలను నాటి పర్యావరణాన్ని కాపాడుకోవాలని, పర్యావరణ పరిరక్షణ మొక్కల పెంపకం ఎంతో దోహదపడుతుందని, మానవాళి అంతా ఆరోగ్యంగా ఉండాలంటే మన చుట్టూ ఉన్న పరిసరాలు పచ్చదనంతో కళకళలాడాలని, అందుకు తప్పనిసరిగా మొక్కలు నాటి వాటిని పరిరక్షించాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో ఐటీడీఏ పరిపాలన అధికారి సున్నం రాంబాబు, మండల అభివృద్ధి అధికారి జమలారెడ్డి,సారపాక సర్పంచ్ కిషోర్ శివరామ నాయక్, ఫారెస్ట్ డిఆర్ఓ ధారావత్ కృష్ణ, ఐటిసి డిప్యూటీ జిఎం విశ్వనాథం,ఎన్ఆర్ఈజీఎస్ ఏపీవో విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వం అవసరమైన ఎరువుల నిల్వలు సిద్ధంగా ఉంచాలి: సీపీఎం

దశ, మణుగూరు: ఖరీఫ్ సీజన్ ప్రారంభమైన నేపథ్యంలో రైతులకు సకాలంలో ఎరువులు, విత్తనాలు అందుబాటులో ఉంచాలని సీపీఎం మణుగూరు మండల కమిటీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. సీపీఎం మండల కమిటీ సమావేశం కామ్రేడ్ దామల్ల లెనిన్‌బాబు అధ్యక్షతన శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం మండల కార్యదర్శి సత్రపల్లి సాంబశివరావు మాట్లాడుతూ రైతులు సాగు పనులు ప్రారంభిస్తున్న ప్రస్తుత సమయంలో యూరియా, డీఏపీ, పొటాష్, కాంప్లెక్స్ ఎరువులను సరిపడా నిల్వ ఉంచి ఎలాంటి ఇబ్బందులు లేకుండా సరఫరా

చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. వ్యవసాయ శాఖ ద్వారా రైతులకు అవసరమైన ఎరువులు, నాణ్యమైన విత్తనాలు, పురుగుమందులు అందించడంతో పాటు రైతు సేవా కేంద్రాల ద్వారా పంపిణీ వ్యవస్థను మరింత పటిష్టం చేయాలని సూచించారు. ఎరువుల కొరత కారణంగా రైతులు ప్రైవేట్ వ్యాపారుల వద్ద అధిక ధరలకు కొనుగోలు చేయాల్సిన పరిస్థితి తలెత్తకుండా ప్రభుత్వం కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని అన్నారు. అలాగే పంటల సాగుపై రైతులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించి, వ్యవసాయ అధికారులను గ్రామాల్లో అందుబాటులో ఉంచాలని కోరారు. రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు వ్యవసాయ రంగం వెన్నెముక వంటిదని, రైతుల అవసరాలను ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యంగా తీసుకోవాలని పేర్కొన్నారు.

పూర్తికాని పంచాయతీ భవనం...

పాఠశాలలో నిర్వహిస్తున్న పంచాయితీ భవనం

పంచాయతీ భవనానికి మోక్షం ఎన్నడు...

❖ పాఠశాల భవనంలోనే పరిపాలన...

❖ ఇబ్బందులు పడుతున్న విద్యార్థులు...

దశ, బూర్గంపాడు: మండలపరిధిలోనికృష్ణసాగర్‌పంచాయితీలో గత మూడు నుండి నాలుగు సంవత్సరాల క్రితం నూతన పంచాయతీ భవనానికి శంకుస్థాపన నిర్వహించి హడావుడిగా నెల రోజుల్లో పంచాయతీ భవనానికి స్లాబ్ వేసి బిల్లులు రాని నేపథ్యంలో సదరు కాంట్రాక్టర్ మిగతా పనులు పూర్తి చేయకుండా నిలిపివేయడంతో మూడేళ్లు గడిచిన ఎలాంటి పురోగతి లేకపోవడం పంచాయతీ భవనం అసంపూర్తిగా దర్శనమిస్తూ ఎక్కిరిస్తుందని గ్రామ ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత బిఆర్ఎస్ పరిపాలనలో నూతన పంచాయితీ భవనాలకు మండలంలో కొన్ని పంచాయతీల్లో ఇదే మాదిరిగా నిర్మాణాలు మధ్యలో ఆపి బిల్లులు రాక కాంట్రాక్టర్ పనులను నిలిపివేశారని వాదనలకు వినపడుతున్నాయి.

ఇది ఇలా ఉండగా కృష్ణ సాగర్ పంచాయితీలో పంచాయతీ భవనం లేక పాఠశాలకు సంబంధించిన ఒక భవనంలో కార్యాలయ విధులు నిర్వహిస్తూ వస్తుండగా పరిపాలన ఇబ్బందిగా మారిందని పలువురు ఆరోపిస్తున్నారు. ప్రతి పంచాయతీ స్వచ్ఛ పంచాయతీగా అభివృద్ధి చెందాలంటే ప్రధమంగా ఆ పంచాయతీకి ప్రభుత్వ పక్కా భవనం ఉండి పరిపాలన కొనసాగించాలని, గ్రామంలో ఉన్న ప్రతి వీధి పరిశుభ్రంగా ఉండాలని, వ్యక్తిగత శుభ్రత పాటిస్తూ ముందుకెళ్తే పంచాయతీ స్వచ్ఛ పంచాయతీగా అభివృద్ధి చెందుతుందన్నారు.

ప్రభుత్వానికి సంబంధించిన పంచాయతీ భవనం లేక పాఠశాల భవనంలోనే సంబంధిత ఫర్నిచర్ కార్యదర్శి రూమ్, సర్పంచ్ రూమ్, పాలకవర్గ సమావేశం హాల్, బ్లీసింగు నిలువ ఉంచే గది పారిశుద్ధ్య పనులకు ఉపయోగించే పనిముట్లు,చెత్త సేకరించే ట్రాక్టర్ నిలపటానికి స్థలం ఇలాంటివి పంచాయతీ భవనం లేక పాఠశాలలో ఉంచాలంటే ఇబ్బందిగా మారుతుందని పాలకవర్గం వాపోతున్నారు. ఇప్పటికైనా జిల్లా అధికారులు కృష్ణ సాగర్ పంచాయితీ కి నూతన భవనం పూర్తిచేసి అందించాలని లేదా కళాశాల ప్రాంగణంలో మరొక భవనాన్ని నిర్మించి అందించాలని పాలకవర్గంతో పాటు గ్రామస్తులు కోరుకుంటున్నారు. అదేవిధంగా మిగతా పంచాయతీలలో కూడా ప్రభుత్వానికి సంబంధించిన పంచాయతీ భవనాలను లేని చోట వెంటనే నిర్మాణం చేపట్టి పరిపాలన సాగించే విధంగా అధికారులు చొరవ చూపాలని కోరుకుంటున్నారు.

పోడు రైతులకు అండగా ఉంటా: ఎమ్మెల్యే పాయం

❖ అటవీశాఖ అధికారులతో ఫోన్‌లో మాట్లాడిన ఎమ్మెల్యే

❖ బోటిగూడెం, బందగిరినగర్ రైతుల సమస్యపై సానుకూల స్పందన

❖ మళ్లీ సర్వే నిర్వహించాలని అధికారులకు ఆదేశం



దశ,పినపాక: మండలంలోని బోటిగూడెం, బందగిరినగర్ గ్రామాలకు చెందిన గిరిజన పోడు రైతుల సమస్యపై ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు తక్షణమే స్పందించారు. అటవీశాఖ అధికారులు తమను వ్యవసాయం చేసుకోనివ్వకుండా అడ్డుకుంటున్నారని రైతులు పినపాక మండలంలో పర్యటించిన ఆయనకు వినతి పత్రాన్ని అందజేశారు. వినతిపత్రంపై ఆయన సానుకూలంగా స్పందించి, వారికి అండగా నిలుస్తానని భరోసా ఇచ్చారు. గత కొంతకాలంగా బోటిగూడెం, బందగిరినగర్ గ్రామాల్లోని సుమారు 45 గిరిజన కుటుంబాలు పోడు వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాయి.

అయితే ఇటీవల అటవీశాఖ అధికారులు వారి వ్యవసాయ పనులను అడ్డుకోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. తమ జీవనాధారమైన భూములను కాపాడాలని కోరుతూ గిరిజన రైతులు ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లును కలిసి తమ సమస్యను వివరించారు. రైతుల ఆవేదనను విన్న ఎమ్మెల్యే వెంటనే అటవీశాఖ ఉన్నతాధికారులతో ఫోన్‌లో మాట్లాడి సమస్యపై పూర్తి వివరాలు తెలుసుకున్నారు.

గిరిజన రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని, సంబంధిత భూములపై మరోసారి సమగ్ర సర్వే నిర్వహించి వాస్తవ పరిస్థితులను పరిశీలించాలని అధికారులను ఆదేశించారు.

అర్హులైన గిరిజన రైతులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని, వారి హక్కులను పరిరక్షించేందుకు తాను ఎల్లప్పుడూ అండగా ఉంటానని ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే స్పందనపై బోటిగూడెం, బందగిరినగర్ గ్రామాల గిరిజన రైతులు హర్షం వ్యక్తం చేస్తూ ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు.

బూర్గంపాడులో భారీగా పీడీఎస్ బియ్యం పట్టివేత

❖ ఆంధ్రప్రదేశ్ నుంచి ఛత్తీస్‌గఢ్‌కు అక్రమ రవాణా యత్నం భగ్నం

❖ వాహన తనిఖీల్లో లారీ స్వాధీనం.. ఇద్దరిపై కేసు నమోదు

❖ పరారీలో ప్రధాన సూత్రధారి, దర్యాప్తు ముమ్మరం

దశ, బూర్గంపాడు: ప్రజా పంపిణీ వ్యవస్థ (పీడీఎస్) ద్వారా పేదలకు అందాల్సిన బియ్యాన్ని అక్రమంగా తరలిస్తున్న ముఠాపై బూర్గంపాడు పోలీసులు ఉక్కుపాదం మోపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని జగ్గయ్యపేట నుంచి ఛత్తీస్‌గఢ్‌కు అక్రమంగా తరలిస్తున్న పీడీఎస్ బియ్యాన్ని శుక్రవారం ఉదయం బూర్గంపాడు వ్యవసాయ మార్కెట్ యార్డ్ సమీపంలో నిర్వహించిన ప్రత్యేక వాహన తనిఖీల్లో పట్టుకున్నారు. ఈవిషయాన్ని బూర్గంపాడు ఎస్ఐ మేడా ప్రసాద్ వెల్లడించారు. శుక్రవారం వాహనాల తనిఖీలు చేపట్టగా, అనుమానాస్పదంగా కనిపించిన ఒడిశా రిజిస్ట్రేషన్ నంబర్ ఓడి 30ఈ4221 గల లారీని ఆపి తనిఖీ చేశారు. తనిఖీల్లో భారీ మొత్తం లో పీడీఎస్ బియ్యం ఉన్నట్లు గుర్తించి వెంటనే లారీని స్వాధీనం చేసుకున్నారు.



ఇద్దరిపై కేసు నమోదు

ఈ ఘటనకు సంబంధించి లారీ యజమాని నవీన్ కుమార్ బాత్ర తండ్రి నప్రతాన్ మాల్ బాత్యను మొదటి నిందితుడిగా, లారీ డ్రైవర్ బికాస్ ఆచార్య తండ్రి బాబులాల్ ఆచార్య, మల్కనగిరి నివాసిని రెండో నిందితుడిగా గుర్తించి కేసు నమోదు చేశారు.

ప్రధాన సరఫరాదారు పరారీలో.....

ఈ అక్రమ రవాణా వెనుక కీలక పాత్ర పోషించిన శ్రీరంగం సత్యనారాయణ ప్రస్తుతం పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు. అతడి కోస గాలింపు చర్యలు చేపట్టినట్లు వెల్లడించారు. ఈ అక్రమ రవాణా వెనుక మరెవరైనా ఉన్నారా అనే కోణంలో కూడా దర్యాప్తు కొనసాగుతోంది.

అక్రమ రవాణాపై ఉక్కుపాదం....

ప్రజల కోసం ప్రభుత్వం అందిస్తున్న ఆహార ధాన్యాన్ని అక్రమంగా తరలించి అక్రమ లాభాలు పొందేందుకు ప్రయత్నించే వారిని ఎట్టి పరిస్థితుల్లోనే ఉపేక్షించబోమని ఎస్ఐ మేడా ప్రసాద్ హెచ్చరించారు. మండలంలో పీడీఎస్ బియ్యం అక్రమ రవాణాపై ప్రత్యేక నిఘా కొనసాగుతోందని, ఇలాంటి చర్యలకు పాల్పడే వారిపై కఠిన చట్టపరమైన చర్యలు తప్పవని స్పష్టం చేశారు.